# బలి

వీరయ్య ఇటీవలనే ఆ ఊళ్లో ఆర్థికంగా బాగా పుంజుకుంటున్న రైతుల్లో ఒకడు. చాలా కాలంవరకు వీరయ్యకు తన తండ్రి ఇచ్చి పోయిన మూడెకరాల చెలకలో యేమీ పండేది కాదు. వీరయ్యను చిన్నప్పుడు వాళ్ళనాన్న ఆ ఊరి ఓ మోతుబరి రైతుదగ్గర కొంతకాలం జీతానికి కూడా వుంచాడు. వీరయ్య కొంచెం పెద్దవాడయ్యాక తమకున్న ఆ కొద్ది భూమినే పట్టుకొని వ్యవసాయం చెయ్యటం మొదలెట్టాడు. రాత్రింబవళ్ళూ రెక్కలు ముక్కలు చేసుకున్నా యేమీ ఫలితం వుండేదికాదు. వీరయ్య కుటుంబానికి సరిపోయేంత తిండికూడా ఆ భూమిలో పండేది కాదు. కాని క్రమక్రమంగా వ్యవసాయరంగంలో వచ్చిన అనేక మార్పులు వీరయ్యలాంటి చిన్న రైతును కూడా ప్రభావితం చెయ్యసాగాయి. తమ ఊళ్లోని చాలామంది తెచ్చుకుంటున్న ఎక్కువ దిగుబడినిచ్చే విత్తనాలను, రసాయన ఎరువుల్ని, వాటి కారణంగా వాళ్లు పండిస్తున్న పంటను వీరయ్య పరిశీలించాడు. తన భార్య మీదున్న కొద్దిపాటి నగల్ని ఆ ఊరి షావుకారు దగ్గర కుదువబెట్టి, అప్పు సంపాదించి తనూ ఆ కొత్తరకం విత్తనాల్ని, ఎరువుల్ని తెచ్చాడు. ఆ సంవత్సరం కాలం కూడా కలిసి రావటంతో వీరయ్య మంచి పంట పండించగల్గాడు. తర్వాత ఆ చెలకలోనే తనూ, తనభార్యా రాత్రింబవళ్ళూ కష్టపడి ఓ బావి తవ్వారు. పూర్వంలా జొన్నలో సజ్జలో కాకుండా బావి తవ్వాక మిరప తోట వేశారు. పరిస్థితులు బాగా కలిసొచ్చి వీరయ్యకు వ్యవసాయంలో తన కుటుంబ ఖర్చులుపోగా కొంత మిగులు కూడా కనిపించింది. తను చేసిన కొద్దిపాటి అప్పులు తీర్చేశాడు. తర్వాత తన ఇద్దరు కొడుకులు ఎదిగిరావడంతో వాళ్లను కూడా చదువు మానిపించి వ్యవసాయంలో

ట్టాడు. ఈలోగా వీరయ్యకు మరొకటి కలిసివచ్చింది. తన చెలకకు-కలిసున్న మరో మూడెకరాల చెలకను వీరయ్య కొనేశాడు. ఆ భూమిలో యేమీ పండించలేని సాంబయ్య పట్నంలో బ్రతుకుదామని వెళ్ళిపోతూ దాన్ని వెయ్యి రూపాయలకు ఎకరం చొప్పున వీరయ్యకు అమ్మేశాడు. యేమీ పండదనుకున్న ఆ భూమిలో వీరయ్య బంగారం పండించాడు.

వీరయ్యకు స్వంత ఖర్చంటూ యేమీ వుండేదికాదు. అలాగే తన భార్యకుగాని, కొడుకులగ్గాని అలాంటి ఖర్చు తక్కువలో తక్కువ ఉండేట్లుగా చూసేవాడు- అందువల్ల వ్యవసాయంలో అతనికి చాలా మిగులు కనిపించేది. ఆ మిగులును మళ్లీ పెట్టుబడి పెట్టి ఇంకా ఎక్కువ పంట పండించేవాడు. ఈ విధంగా వీరయ్య క్రమక్రమంగా ఆర్థికంగా చాలా పైకొచ్చాడు.

ఇలా వుండగా ఆ వూళ్ళో ఒకప్పుడు చాలా పెద్ద భూస్వామి అని పేరుపొందిన నారాయణరావు సీలింగ్‌లో తన భూమి పోతుందని భయపడి అందులో చాలావరకు అమ్మెయ్యాలని నిర్ణయించుకున్నాడు. వీరయ్య అతని దగ్గర్నుంచి ఊరిపక్కనే వుండే ఓ పదెకరాల పొలం కొనేశాడు. అందుకోసం అతడు కొంత అప్పుకూడా చేశాడు ఆ రోజుల్లోనే వీరయ్య తన పెద్దకొడుకు పెళ్ళి చేశాడు. బాగా ఉన్నవాళ్ళే మంచి వరదక్షిణ ఇచ్చి వీరయ్య కొడుక్కి పిల్లనిచ్చారు. నారాయణరావు భూమి కొనటానికి వీరయ్యకు ఈ వరదక్షిణ డబ్బుకూడా బాగా కలిసొచ్చింది.

వీరయ్య కిప్పుడు రెండుచోట్ల వ్యవసాయం. ఇప్పుడిక అతనికి నల్గురైదుగురు జీతగాళ్లను పెట్టక తప్పలేదు. పూర్వం వుంటున్న గుడిశను మార్చేసి మంచి భవంతి కట్టించాడు. పశువుల కోసం పెద్ద కొట్టం కూడా కట్టించాడు. ఎప్పుడూ పుట్లకొద్ది ధాన్యం అతనింటికి వస్తూండేది. ఆ ధాన్యాన్ని అమ్మే విషయంలో వీరయ్య చాలా జాగ్రత్తగా వుండేవాడు. ఎవర్నీ సులభంగా నమ్మేవాడు కాదు. ఏ సమయంలో ఎవరికి అమ్మితే మంచిధర వస్తుందో కూడా అతడు తెలుసుకున్నాడు. ధాన్యాన్ని చాలా కాలం తనదగ్గరే ఉంచుకొని మంచి ధర వచ్చినప్పుడే దాన్ని లారీమీద స్యూర్యాపేట మార్కెట్‌కు తీసికెళ్ళి అమ్మేవాడు.

ఒకప్పుడు ఏమీలేని వీరయ్య ఇంత పెద్దవాడు కావడంతో ఆ ఊళ్లో చాలామంది కళ్లు అతని మీద పడ్డాయి.

"నువ్వింకా వీరయ్య వేమిటి? వీరారెడ్డివి" అనేవాళ్ళు. వీరయ్య కాపు కులస్తుడు. కాబట్టి కాపు బలిస్తే రెడ్డి అవ్వాలన్న సాంప్రదాయం ఆ ప్రాంతాల్లో ఉంది కాబట్టి వాళ్ళంతా అలా అంటున్నారని వీరయ్యకు తెలుసు. వీరయ్యకు 'వీరారెడ్డి' అని పిలిపించుకోవటం ఇష్టం లేకపోయినా ఆ ఊళ్ళో అందరూ అతన్ని 'వీరారెడ్డి' అని పిలవటం మొదలెట్టారు. వీరయ్య కొడుకులకు మాత్రం ఈ మార్పు చాలా ఉత్సాహాన్నిచ్చింది. ఇదివరకు వాళ్ళను రామయ్య, రాజయ్య అని పిలిచిన వాళ్లే ఇప్పుడు రామ్ రెడ్డి, రాజారెడ్డి అని పిలవటంతో వాళ్లకు కొండెక్కినట్లుగా వుండేది. ఎవ రైనా వాళ్లనిప్పుడు పూర్వంలా 'రామయ్య' రాజయ్య అని పిలిస్తే వాళ్లకు చాలా కోపమొచ్చేది.

ఆ తర్వాత వీరయ్య రెండో కొడుకు రాజయ్యకూడా పెళ్లయ్యింది. అతనికి యాభై వేల కట్నమిచ్చి పిల్లనిచ్చారు.

వీరయ్య ఎంత మొత్తుకున్నా వినకుండా అతని కొడుకులు చాలా ఖరీదైన బట్టలు వేసుకోవటం, మొరటుకష్టం చెయ్యకుండా ఎక్కువమంది జీతగాళ్లను పెట్టుకోవటం, అప్పుడప్పుడు భార్యల్ని తీసుకొని హైదరాబాద్ వెళ్ళి సినిమాలు చూసిరావటం మొదలైన పనులు చెయ్యటం మొదలెట్టారు.

సంవత్సరం క్రితమే వీరయ్య మరికొంత భూమికొన్నాడు. ఆ ఊరి మరో పెద్ద భూస్వామి భూపాల్‌రెడ్డి పల్లెటూళ్ళళ్లో రోజురోజుకు లేబర్‌తో చాలా సమస్యలొస్తున్నాయని, తనలాంటివాళ్లు ఇక వ్యవసాయం చెయ్యలేరని భావించి, తన భూమినంతా అమ్మేసి పట్నంలో వ్యాపారం చెయ్యాలని నిర్ణయించుకున్నాడు. అలా భూపాల్‌రెడ్డి అమ్మిన భూమిలో వీరయ్య మరో పదెకరాల పొలం కొన్నాడు. ఆ పొలం కూడా ఊరికి చాలా దగ్గర్లో వుంటుంది. ఆ భూమిలోనే పెద్ద బావి తవ్వించాడు. ఊరికి చాలా దగ్గరగా వుండటంవల్ల ముఖ్యంగా ఎండాకాలం ఆ ఊళ్లో చాలా మంది స్నానాలు చెయ్యటానికి, బట్టలుతుక్కోవటానికి ఆ బావికే వచ్చే వాళ్లు. ఆ ఊరి కుర్రవాళ్లంతావచ్చి బావిలో గంటలకు గంటలు ఈతలు

కొట్టేవాళ్లు. తను కష్టపడి తీయించిన ఆ భావిని ఆ ఊరికి ఊరంతా అలా వాడుకోవటాన్ని వీరయ్య భరించలేకపోయాడు. రోజూ ఎవరో ఒకరితో ఈ విషయంలో గొడవపెట్టుకునేవాడు.

ఆ ఊరి పట్వారి కొడుకు ఒకరోజు ఆ భావిలో వేరే కుర్రాళ్ళతో ఈతకొడ్తూ వీరయ్యకు దొరికిపోయాడు. అందరితోబాటు ఆ కుర్రాన్ని కూడా నోటికొచ్చినట్టల్లా తిట్టాడు వీరయ్య. గుంపులోంచి ఎవరో "ఆ పిల్ల వాడు పట్వారి కొడుకు" అని చెబితే కూడా వీరయ్య వినిపించుకోలేదు. ఆ సాయంకాలం పట్వారి నరహరిరావు వీరయ్యను పిలిపించాడు- వీరయ్య కనిపించగానే—

"మా పిల్లవాన్ని నోటికొచ్చినట్టు తిట్టినవట" అన్నాడు నరహరి రావు-

"భాయినంత నాశనం జేస్తుంటే యేం జెయ్యమంటరు మరి—" అతడు పట్వారి అని యే మాత్రం కూడా లెక్క చెయ్యకుండా సమాధానం చెప్పాడు వీరయ్య.

"ఈత గొట్టినంత మాత్రాన నీ భాయికేమయితాంది? అరిగి పోతాందా? కరిగిపోతాందా? పిల్లగాండ్లను ఎందుకట్ల తిడ్తవు? ఎండాకాలం గాబట్టి, ఊరికి దగ్గరుంది గాబట్టి నీ భాయి కొస్తాంన్రు. ఈత గొడ్తామన్న సంబ్రంతోటి పిల్లగాండ్లు వస్తాంన్రు. మా పిల్లగాడని తెలిసినంక గూడా నోటికొచ్చినట్లు బూతులు తిట్టినవట. ఇదేం మర్యాదగాదు" అన్నాడు నరహరిరావు.

"యేం మర్యాదుంన్రడి—కష్టపడి తీయించుకున్న భాయిని నాశనం జేస్తాంన్రు మీ పిల్లగాడైతేనేం—ఎవరి పిల్లగాడైతేనేం— నా కడుపు మసిలింది. తిట్టిన" అన్నాడు వీరయ్య. అంటూనే అక్కణ్ణించి వెంటనే తనింటికి వచ్చేశాడు.

"వీనికి ధనమదం ఎక్కువైంది— ఈ ఊర్లే ఇకవీరు ఎవరికీ వినడు" అన్నాడు నరహరిరావు అక్కడున్న ఆ ఊరి వాళ్ళతో—

సరిగ్గా ఈ రోజుల్లోనే ఆ ఊరికి కరెంట్ వచ్చింది. ఆ ఊరి సర్పంచ్ ఖర్చులకని చెప్పి భావికి వెయ్యి రూపాయల చొప్పున తీసు

కొని కరెంట్ పెట్టిస్తానని చెప్పాడు- ఆ సందర్భంలోనే సర్పంచ్ వీరయ్యని కూడా పిలిచి కరెంట్ పెట్టించుకోమని సలహా ఇచ్చాడు.

"ఖర్చులకే వెయ్యిరూపాయలా? నాకు మీ కరంటొద్దు- గిరెం టొద్దు" అంటూ సర్పంచ్ దగ్గర్నుంచి వచ్చేశాడు-

అంతకుముందు కూడా ఒకసారి వీరయ్య సర్పంచ్ మాట విన కుండా అతనికి కోపం తెప్పించాడు- ఇప్పుడా ఊరికి సర్పంచ్‌గావున్న మురళీధర్‌రావు పంచాయితీ బోర్డు ఎన్నికలప్పుడు వీరయ్యను తనపార్టీ తరఫున వార్డ్ మెంబర్‌గా నిలబడమని అడిగాడు- వీరయ్య దగ్గర నాల్గు రాళ్ళున్నాయని చూసే మురళీధరరావు అతన్ని ఎన్నికల్లో దించాలని ప్రయత్నించాడు- అప్పుడు కూడా ఇలాగే.

"నాకు మెంబరొద్దు....గింబరొద్దు" అని దురుసుగా సమాధానం చెప్పాడు.

"నాకు ఎన్నికలళ్ళ నిలబడటానికి ఎక్కడి డబ్బుచాల్తలేదు. ఓ వెయ్యి రూపాయలు అప్పివ్వమ"ని అడిగాడు మురళీధర్‌రావు.

"నాదగ్గర ఒక్క పైసా కూడ లేద"న్నాడు వీరయ్య.

"ఎప్పుడైనా అవకాశం వస్తే వీడిపొగరు అణచాలి" అను కున్నాడు తర్వాత సర్పంచ్‌గా ఎన్నికైన మురళీధర్‌రావు.

'కరెంట్ ఇప్పుడొచ్చె... అప్పుడొచ్చె' అంటూనే ఆరు నెలలు గడిచాయి. ఆతర్వాత మెల్లగా కరెంట్ స్తంభాలు వెయ్యటం మొద లెట్టారు. తర్వాత వైరింగ్ చెయ్యటం మొదలెట్టారు. ఇక ఈరెండు మూడు వారాల్లో భావులకు కరెంట్ కనెక్షన్ యిస్తారని, వెయ్యిరూపాయి లిచ్చి లిస్టులో పేర్లు రాయించుకొన్నవాళ్ళందర్నీ కరెంట్ మోటార్లను పైపులను, ఇతర సామాన్లను తెచ్చుకొమ్మని చెప్పాడు సర్పంచ్. మొదట్లో వెయ్యిరూపాయిలివ్వనివాళ్లుకూడా ఇప్పుడిస్తే అందరితోబాటు వాళ్ళ బావులక్కూడా కరెంట్ పెట్టిస్తానని చెప్పాడు.

వీరయ్య పెద్దకొడుకు రామారెడ్డి తండ్రితో ఓ రాత్రంతా పోరాడి తమ భావిక్కూడా కరెంట్ పెట్టించటానికి ఒప్పించాడు. ఆ మర్నాడే రామారెడ్డి వెళ్ళి సర్పంచ్‌కి వెయ్యిరూపాయిలిచ్చి 'మేం కూడా కరెంట్ పెట్టించుకుంటామ'ని చెప్పాడు. వెంటనే అందరితోబాటు

సూర్యాపేటకువెళ్ళి కరెంట్ మోటారు, పైపులు మొదలైన సామాన్లన్నీ తెచ్చాడు.

కరెంట్‌వాళ్లు మళ్ళీ. చాలా రోజులదాకా కనిపించలేదు. ఈలోగా ఆ ఊళ్ళో ఆ ఊరి యువకులు కొందరుకలిసి ఓ కొత్తపార్టీ పెట్టారు. ఆ పార్టీకి సుధాకర్ నాయకుడయ్యాడు. ఆ గోడలన్నీ "విప్లవం వర్ధిల్లాలి" "భూస్వాముల దౌర్జన్యాలు నశించాలి" "వ్యవసాయ కూలీల జీతాల్ని పెంచాలి" "కార్మికకర్షక ఐక్యత వర్ధిల్లాలి" "ఆకలితో చచ్చే కన్నా పోరాటంలో చావటం మేలు" "తుపాకి గొట్టం ద్వారానే రాజ్యాధికారం సంక్రమిస్తుంది"- మొదలయిన నినాదాలతో నిండిపోయాయి.

చూస్తుండగానే కొత్తపార్టీలో ఆ వూరి యువకులంతా చేరారు. ఆవూరి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనటం మొదలెట్టారు.

'కరెంట్ పెట్టించటానికి వెయ్యిరూపాయిలెందుకు? అందులో సగం సర్పంచే భోంచేస్తాడ'ని సుధాకర్ బాహాటంగానే అనటం సర్పంచ్ చేసే ప్రతిపనిని దుయ్యబట్టటం మొదలెట్టారు. వర్షాలుపడి నాట్లుపెట్టే సమయానికి 'ప్రభుత్వం నిర్ణయించిన కనీసవేతనం ఇస్తేనే కూలీకొస్తాం. లేకపోతే సమ్మె చేస్తామ' నికూలీలచేత చెప్పించి వాళ్ళతో సమ్మె చేయించారు– భూస్వాములంతా దిగొచ్చి వాళ్ళడిగిన కూలీ ఇవ్వటానికి ఒప్పుకున్నారు.

రెండుమూడు నెలల్లోనే ఆ వూళ్లో సర్పంచ్ మాటకు ఎంత విలువవుందో సుధాకర్ మాటక్కూడా అంతవిలువొచ్చేసింది. హరిజనులు. వ్యవసాయ కూలీలు సుధాకర్ దగ్గరికొచ్చి వాళ్ళ సమస్యల్ని అతనితో చెప్పుకోవటం మొదలెట్టారు. వూర్లో యే పంచాయితీ పరిష్కారం కావాలన్నా అందుకు మొదలు సుధాకర్ ఒప్పుకోవాలి. సుధాకర్‌ని కాదని ఆ వూళ్ళో ఎవరిమధ్యా ఎలాంటి ఒప్పందం జరగటానికి వీల్లేని పరిస్థితి యేర్పడింది.

హైద్రాబాద్‌లో వాళ్ళ పార్టీ రాష్ట్ర సమావేశాలు జరుగుతున్నాయని అందుకోసం కొంత డబ్బు కావాలని సుధాకర్ ఆఊళ్ళో చందాలు వసూలు చెయ్యడం మొదలెట్టాడు. ఆ ఊళ్లో ఆర్థికంగా బాగా వున్న వాళ్ళందర్నీ ఐదువేలు చందా యివ్వాలని అడిగాడు సుధాకర్. ఆ ఐదువేలు

ఇవ్వవలసిన వాళ్ల లిస్టులో వీరయ్య పేరుగూడా చేరింది. సుధాకర్ ఎవరిని ఎంత చందా ఇవ్వమని వాళ్ల అడిగితే అంత చందా నోరు మెదపకుండా ఇచ్చేశారు. సర్పంచ్, పట్వారి, పటేల్ మొదలైన వాళ్లతోబాటు ఆ ఊరి మోతుబరి రైతు లందరూ లోపల ఎంత కుమిలి పోతున్నా పైకిమాత్రం ఏమీ మాట్లాడ కుండా సుధాకర్‌కు ఐదువేలు ఇచ్చేశారు. యీ విషయంలో సుధాకర్‌తో గొడవపెట్టుకుంటాడనుకున్న ఆవూరి సర్పంచ్‌కూడా మరోమాట మాట్లాడకుండా ఆ ఐదువేలు చందా ఇచ్చెయ్యటం అందర్నీ ఆశ్చర్యపరచింది.

ఐదువేలు చందా యివ్వమని సుధాకర్ తన అనుచరులతో వీరయ్య దగ్గరకూ్కడా వచ్చాడు,

"చందా? ఐదువేలా? ఒక్క పైసగూడా ఇయ్యను. ఏం జేస్తరో జేసుకోరి" అన్నాడు వీరయ్య.

"ఊర్లె అందరిచ్చిండ్రు - నువ్వెందుకియ్యవు? నీకేమన్న కొమ్ములున్నయా?" అన్నాడు సుధాకర్.

"ఎందుకియ్యాలి? నన్నింతవరకు ఈ ఊర్లెచందా అడిగినవాడులేడు. నువ్వెందు కడ్గుతున్నవ్? నీకేమన్న కొమ్ములున్నయా నువ్వు నాదగ్గరే మన్న సొమ్ము దాయబెట్టినవా? నేనెవ్వని కొంపన్నా ముంచి ఈ ఆస్తి సంపాయించినా! రేత్రనక పగలనకా రెక్కలు ముక్కలు చేసుకుంటే నేనియ్యాళ ఈ స్థితికొచ్చిన! ఐదువేలు ఎట్లొస్తయనుకున్నవు? వాన్ని వీన్ని బెదిరించటంకాదు- నీఅంతట నువ్వు ఒక్క వందరూపాయలు సంపాయించు- అప్పుడు తెలస్తది డబ్బంటే ఏమిటిదో" అన్నాడు వీరయ్య.

"నీ ఉపన్యాసం అనవసరం- చందా ఇస్తవా. ఇయ్యవా?" అన్నాడు సుధాకర్.

"ఇయ్యనని ఎప్పుడో చెప్పిన" అన్నాడు వీరయ్య.

"సర్లే- నీసంగతి చూస్తంలే" అంటూ గిరుక్కున అక్కణ్ణించి తిరిగి బయటకు వెళ్ళిపోయాడు సుధాకర్.

"పోర....పో....నా కండ్ల ముందల బుట్టినోడివి-నన్నేం బెదిరిస్తవు" అన్నాడు వీరయ్య.

వీరయ్య సుధాకర్‌తో అంత ధైర్యంగా మాట్లాడటం ఊళ్లో అందర్ని ఆశ్చర్యపరచింది. "సర్పంచ్, పట్వారీ అంతటివాళ్లే దిగొచ్చి నప్పుడు వీడికెందుకింత పొగరు. వాళ్ళు తొందర్లోనే వాడి పొగరు అణచేస్తార్లే" అనుకున్నారు.

వీరయ్య చందా యివ్వలేదని తెలిసినప్పుడు సర్పంచ్, పట్వారి మొదలైన ఊరిపెద్దలు వీరయ్య సుధాకర్‌ను కాకుండా తమనుతమ పెద్దరి కాన్ని అవమానించినట్టు ఫీలయ్యారు. ప్రజలముందు తామే మో పట్టి పిరికివాళ్లగాను, తనేమో ధైర్యవంతుడుగాను నిలబడి పోయాడని-ఆ ఊరి పెద్దలంతా వీరయ్యమీద లోలోపల ఉడికిపోయారు.

వీరయ్య భార్య, కొడుకులు, కోడళ్ళు ఈ సంఘటన తర్వాత చాలా భయపడిపోయారు.

"వాళ్ళతో పెట్టుకుంటే చాలా ప్రమాదం- యే అర్థరాత్రో వచ్చి మన ఇల్లంతా దోచుకుపోతారు" అన్నాడు రామారెడ్డి.

"ఇప్పటికయినా వాళ్ళకు ఆ ఐదువేలు ఇచ్చేద్దాం" అన్నాడు రాజారెడ్డి-

"వాళ్ళకా డబ్బియ్యకపోతే చంపిపోతరు నాన్నా" అన్నాడు రామారెడ్డి.

"ఛస్తవంటే నాకు భయంలేదురా! నేను చచ్చినంక ఆ ఐదువేలు వాళ్ళకియ్యండ్రి-నేను బతికున్నంత వరకుమాత్రం ఇయ్యొద్దు-ఈ ఆస్తి నా కష్టార్జితంరా. తినకుంట, తాగకుంట. మంచి బట్ట కట్టకుంట కష్టం జేస్తే మీయియ్యాల ఇట్లున్నరు. నేను యేం తప్పు జేసిన్నని వాళ్ళకు భయపడ్త? ఎవన్నన్నా దోచుకున్నానా? ఎవని పొట్టనా కొట్టిన్నా? మొన్న ఈఊరిదొర భూపాల్‌రెడ్డి భూమంతా అమ్ముకొని పట్నంబో యిండు. సినిమాహాళ్ళు కడ్తాండు. లక్షలు సంపాయిస్తాండు. యీలీడర్లంతా వాళ్ళజోలి కెళ్ళరెందుకు? లోకంల డబ్బునోళ్ళం మనమే వున్నామా?" అన్నాడు వీరయ్య. వీరయ్య ఎంత మొండివాడో తెలిసిన అతని కుటుంబసభ్యులు అంతటితో నోరు మూసుకున్నారు.

* * *

ఈ సంఘటన జరిగిన ఓ నెలరోజుల తర్వాత ఎంతకాలంగానో

వస్తారనుకుంటున్న కరెంట్‌వాళ్ల భావులకు కరెంట్ కనెక్షన్లు ఇవ్వటానికి వచ్చారు వాళ్ళొచ్చేటప్పటికే మధ్యాహ్నం రెండయింది.

ఊరికి దగ్గర్లోఉన్న భావులతో ప్రారంభించి, వరుసలో మొదట్లోనే వున్న వీరయ్య భావిదగ్గరే పని ప్రారంభించారు. మోటారు, పైపులు ఫిక్స్ చేశాక యిద్దరు వైర్‌మెన్‌లు పోల్ నుంచి సర్వీసు వైర్‌తో వీరయ్య భావికి కరెంట్ కనెక్షన్ ఇచ్చారు. అప్పటికే చీకటి పడి పోయింది. మిగతా పనేదన్నా వుంటే రేపొచ్చి చూడొచ్చులే అనుకొని వీరయ్య, లైన్‌మెన్లు, వైర్‌మెన్లు, హెల్పరు—అందరూ ఊళ్లో కొచ్చేశారు.

వాళ్లంతా అలా వెళ్లిపోగానే గొడ్లను కొట్టంలో కట్టేసి అదేదాల్లో వస్తున్న గొడ్లను కాసే ఆ ఊరి హరిజన కుర్రాళ్లు— యాదయ్య, సమ్మయ్యలకు ఎప్పటిలాగే వీరయ్య భావిలో కాస్సేపు ఈతగొట్టి పోదామన్న కోరిక కల్గింది.

"అరె యాదిగా! పెయ్యంత చిటచిట కుడ్తాంది, వీరయ్య భాయిల ఈతగొట్టి పోదాంరా!" అన్నాడు సమ్మయ్య.

"ఆడు సూత్తే తిడ్తడు- కడుపుల మాడ్తాంది ఇంటికిపోదాంరా?" అన్నాడు యాదయ్య.

"యీరయ్య గిప్పుడు యింటికిబోయి కల్లు తాగుతడు. గిప్పుడిక రాడు-" అంటూ యిద్దరూ బట్టలు విడిచేసి ఆ భావిలోకి దుమికారు. అంతే! మరుక్షణంలో అంతవరకు నిండు జీవంతో తొణికిసలాడిన ఆ రెండు శరీరాలు రెండు శవాలుగా మారిపోయాయి.

* * *

ఆ మర్నాడు తెల్లవారేటప్పటి కల్లా వీరయ్య భావిలో రెండు శవాలు తేలాడాయన్నవార్త ఊళ్లో దావానలంలా వ్యాపించింది. అందరూ గుంపులు గుంపులుగా ఆ భావిదగ్గరకు రాసాగారు. ఆలోగానే కరెంట్ వాళ్లు తాము వైరింగ్‌లో చేసిన పొరపాటువల్లనే కరెంట్ నీళ్లలోకి లీకయి భావంతా కరెంట్ వ్యాపించటంవల్లనే ఆ కుర్రాళ్ళిద్దరూ మరణించారని గ్రహించారు. అందుకే పోలీసులొచ్చేంతవరకు ఎవరీన్ని ఆభావి దగ్గరకు వెళ్లనీయలేదు.

ఊరికి ఊరంతా వచ్చి ఆ భావిచుట్టూ చేరింది. అందులో చాలా మంది వీరయ్య తన భావికి ఓ మనిషిని బలిస్తానన్న తన మాటను నిలుపుకున్నాడని అన్నారు. అక్కడకు చేరిన ఆ కుర్రాళ్ళిద్దరి తల్లిదండ్రులు,

"ఈరయ్య మిమ్ముల్ని ఆని భాయికి బలిచ్చిండురో" అని నెత్తి నోరు బాదుకుని యేడవసాగారు.

కరెంట్ లీక్‌కావటంవల్లనే వాళ్ళిద్దరూ చనిపోయారని అందరికీ తెల్సినప్పటికి ఆ విషయం నమ్మటానికి అక్కడికొచ్చిన వాళ్లెవరూ సిద్ధంగాలేరు—వీరయ్య కావాలనే కరెంట్ లీక్ చేయించి తన భావికి ఆ ఇద్దరు అమాయకుల్ని బలిచ్చాడని నమ్మటమే వాళ్ళకు బాగుంది.

వాళ్ళిద్దరి చావుకు తనే కారకుడని జనమంతా అనుకుంటున్నారని తెలిసినప్పటికీ వీరయ్య చలించలేదు.

సూర్యాపేటనుండి పోలీసులొచ్చారు—ఎలక్ట్రిసిటీ బోర్డుకు చెందిన ఉన్నతాధికారులొచ్చారు - కరెంట్ వైర్లను పరిశీలించి వైర్‌మెన్లు చేసిన పొరపాటువల్లనే కరెంట్ లీకయ్యిందని, అది నీళ్ళల్లోకి వ్యాపించటం వల్లనే యాదయ్య, సమ్మయ్య చనిపోయారని, ఇందులో భావి యజమాని వీరయ్య బాధ్యత యేమీలేదని డివిజనల్ ఇంజనీర్ రిపోర్టిచ్చాడు.

"వీరయ్య బాధ్యత యేమీలేదు" అన్న ఆ రిపోర్టును అంగీకరించటానికి ఆ వూరి పెద్దలెవరూ సిద్ధంగాలేరు.

"ఆ కరెంట్ వాళ్ళను, పోలీసోళ్ళను మొదలేకలుపుకొని వాళ్ళ మొఖాన ఓ ఐదారు వేలుపోసిండు. అందుకే వాళ్లట్లరాసింద్రు" అన్నాడు పట్వారి.

"ఈ రిపోర్ట్ల సంగతి నాకు తెల్వందా?" అన్నాడు సర్పంచ్.

"రెండు నిండు ప్రాణాల్ని ముత్తాలమ్మకు బలిచ్చినవుగదూ, నీ ప్రాణం ఎన్నాళ్లుంటదో నేను జూస్త" అన్నాడు సుధాకర్ వీరయ్య మొఖం మీదే-

ఆ రాత్రికిరాత్రే ఆ వూరి గోడలనిండా పోస్టర్లు పడ్డాయి.

"అమాయకులైన యాదయ్య, సమ్మయ్యలను తన భావికి బలిఇచ్చిన బడా భూస్వామి వీరారెడ్డిని శిక్షించండి"

"హరిజనుల మీద భూస్వాముల దౌర్జన్యాన్ని ఖండించండి."

"పేదలకష్టాన్ని దోచుకొని ధనవంతుడై విర్రవీగుతున్న వీరా రెడ్డికి తగిన గుణపాఠం నేర్పించండి" "వీరారెడ్డి యాదయ్య, సమ్మయ్యల తల్లిదండ్రులకు న్యాయమైన నష్టపరిహారాన్ని చెల్లించకపోతే అందుకు తగిన శిక్షను విధించండి"

ఆ పోస్టర్లు ఆ ఊళ్ళో చాలామందికి ఎంతో వినోదాన్ని అందించాయి. ఊరి పెద్దలంతా ప్రత్యేకంగా వచ్చి ఆ పోస్టర్లను చదువుకొని ముసిముసినవ్వులు నవ్వుకుంటూ వెళ్ళిపోయారు.

ఇదంతా చూస్తున్న వీరయ్య మాత్రం ఎప్పటిలాగే తన దైనందిన కార్యక్రమాల్ని కొనసాగించుకుంటూ గడపసాగాడు. "అందరూ కట్ట గట్టుకొని చావుండ్రి. ఇందుల నా తప్పుమాత్రం యేంలేదు." అన్నాడు ఇదంతా చూస్తూ గాభరాపడిపోతున్న తన కుటుంబ సభ్యులతో-

ఐదారు రోజులు గడిచాయి.

ఎప్పటిలాగే ఆరోజు రాత్రి కూడా గుర్రుపెట్టి నిద్రపోతున్న వీరయ్యను అర్ధరాత్రి దాటాక కొడుకు రామారెడ్డి వచ్చి లేపాడు.

"ఎవరో లీడర్లొచ్చిర్లట-మనల పంచాయితి బోర్డు ఆఫీసుకాడికి రమ్మంటాండ్రు" అన్నాడు రామారెడ్డి.

"లీడర్లంటే ఎవర్రా" అన్నాడు వీరయ్య,

"మనూళ్ళే సుధాకర్ లేడు-ఆయన పార్టీవోళ్లు"

వెంటనే ఆ వచ్చిన వాళ్లెవరో వీరయ్యకు అర్థమైపోయింది. పక్కమీంచి లేచి మీద తువ్వాల వేసుకొని బయటకొచ్చాడు. వాళ్ళింటి బయట నల్గురు యువకులు—ఇద్దరు ఆ ఊరివాళ్లు, మరో ఇద్దరు కొత్త వాళ్లు నిల్చొనివున్నారు. వీరయ్య అతని ఇద్దరు కొడుకులు ఆ చీకట్లో ఆ నల్గురివెంట నడిచి, పంచాయితిబోర్డు ఆఫీసు దగ్గరకు చేరుకున్నారు.

పంచాయితిబోర్డు ఆఫీసు సరిగ్గా ఆ ఊరి మధ్యలో నాల్గురోడ్లు కలిసేచోట వుంది. వీరయ్య వాళ్ళు అక్కడికి వెళ్లేటప్పటికే అక్కడ యించుమించు ఆ వూళ్లోని సగం జనాభా అక్కడ గుమిగూడివుంది. ఆ గుంపులో ఆ ఊరి సర్పంచ్, పట్వారి, పటేల్ మొదలైన గ్రామపెద్దలు కూడా కూర్చొనివున్నారు. సరిగ్గా ఆ గుంపు మధ్యలో యాదయ్య,

సమ్మయ్యల తల్లిదండ్రులు కూడా కూర్చొనివున్నారు. వీరయ్యను చూడ గానే గుంపులో కలకలం బయల్దేరింది.

ఆ గుంపు మధ్యలో ప్యాంట్, బుషర్ట్ వేసుకొని కూర్చున్న ఓ కొత్త వ్యక్తిని యీరయ్యకు చూపిస్తూ "అతడే సురేందర్, మనలీడర్" అన్నాడు యీరయ్యను అక్కడకు తీసుకొచ్చిన ఆ నల్గురు యువకుల్లో ఓ యువకుడు—

యీరయ్యను చూడగానే సురేందర్ లేచి నిల్చున్నాడు. "డియర్ కామ్రేడ్స్!" అర్ధరాత్రి, ఆ నిశ్శబ్ద వాతావరణంలో సురేందర్ కంఠం ఖంగుమని మ్రోగింది- అందరూ నిశ్శబ్ధంగా అతడేం చెబుతాడో వినడానికి సిద్ధమయ్యారు.

"ఇది ప్రజాన్యాయస్థానం- పీపుల్స్ కోర్టు, ఇందులో మీరే న్యాయమూర్తులు మీ ఊళ్లో జరిగిన యిద్దరు అమాయకుల హత్యలకు బాధ్యుడైన యీరారెడ్డికి యేం శిక్ష విధిస్తారో మీరే విధించండి" అన్నాడు సురేందర్.

"ప్రాణానికి ప్రాణం-అదే శిక్ష" గుంపులోంచి అరుపులు-

"యిందులో ముద్దాయి యీరారెడ్డి చెప్పుకోవాల్సింది ఏమన్నా వుందా?" అన్నాడు సురేందర్ యీరయ్యకేసి తిరిగి.

యీరయ్య కాస్సేపు ఏమీ మాట్లాడలేదు. అక్కడున్న వాళ్ళం దర్నీ ఓసారి కలియ చూశాడు.

"యీరయ్యా! నువ్వేమన్న చెప్పుకునేదుందా?" అరిచాడు సురేం దర్ పక్కనేవున్న సుధాకర్-

"చూస్తుండంగనే నువ్వెంత పెద్ద లీడరు వై పోతివేంరో"అన్నాడు యీరయ్య.

"యీరయ్యా! కొంచెం మాటలు జాగ్రత్తగా రానీయ్" మళ్లీ అరిచాడు సుధాకర్.

"యీరారెడ్డీ! నువ్వేమైనా చెప్పుకునేదుందా? లేదా? మేం వెళ్ళి పోవాలి-మా కెక్కువ టైం లేదు" అన్నాడు సురేందర్.

"నేను చెప్పుకునేదేముంది-జరిగిందేదో అందరికీ యెరికే. అందరు పెట్టించుకున్నట్టే నేను కరెంట్ పెట్టించుకున్న - నాకర్మ బాగలేక వాళ్లు

ద్దరు చచ్చింద్రు- దాంట్లె నా తప్పేం లేదు" అన్నాడు యీరయ్య.

"అబద్ధం-పచ్చి అబద్ధం నువ్వే వాళ్ళిద్దర్నీ చంపావు. నీ భావికి యిద్దరు ముక్కుపచ్చలారని పసివాళ్లను బలిస్తానని నువ్వు నమ్మిన నీ క్షుద్రదేవత ముత్యాలమ్మకు మాటిచ్చావు. ఆ మాటను నిలుపుకోవటానికే నీ భావికి కరెంట్ కనెక్షన్ యిచ్చిన వైర్‌మెన్లకు లంచమిచ్చి డిఫెక్టివ్ వైరింగ్ చేయించావు. కావాలనే ముందువేసుకున్న పథకం ప్రకారమే నువ్వు నీ భావికి కరెంట్ లీక్ చేయించావు. కాబట్టి ఆ యిద్దరు అమాయక జీవుల నిండు ప్రాణాల్ని బలి తీసుకున్నది నువ్వేనని నేనీ ప్రజాకోర్టులో ఆరోపిస్తున్నాను. కామ్రేడ్స్! చెప్పండి నా ఆరోపణ నిజమా, కాదా?" అన్నాడు సురేందర్.

"నిజమే.... నూటికి నూరుపాళ్లూ నిజమే" అక్కడున్న యువకు లంతా గొంతుచించుకొని అరిచారు.

"మా ఆరోపణలు నిజమని ఋజువు చెయ్యటానికి తగిన సాక్ష్యాధారాలు కూడా మా దగ్గర వున్నాయి సుధాకర్! నువ్వు చెప్పు....మీరో సారి యీరారెడ్డి భావిలో స్నానం చెయ్యటానికి వెళ్ళినప్పుడు అతడే మన్నాడో" అన్నాడు సురేందర్.

"కామ్రేడ్స్ ! నేను యింకొంతమంది ఫ్రెండ్స్‌తో యీరయ్య భావికి ఈతకొ త్తమని పోతే ముత్తాలమ్మ రోజూ కలలో కండ్లబడి బల డుగుతాందని,మీలో ఎవ్వనోన్ని ఒకన్ని బలిస్తనని ఈ వీరారెడ్డి అన్నాడు" అన్నాడు సుధాకర్.

"ఔను! ఔను! నాతోటి కూడా అన్నాడు 'బలి, బలి' అని ఆ భాయిని చూసినప్పుడల్లా అంటనే వున్నడు" అన్నారు ఐదారుగురు యువకులు ఒకరి తర్వాత ఒకరు లేచి.

"ఆ ఇద్దరు పసివాళ్ళ హత్యలు యీరారెడ్డే చేయించాడని ఇప్పుడు నిస్సందేహంగా ఋజువైంది. యిప్పుడు ముద్దాయికి ఏం శిక్ష విధించాలో కూడా మీరే నిర్ణయించండి" అన్నాడు సురేందర్.

"ప్రాణానికి ప్రాణం, రక్తానికి రక్తం అదే నిజమైన న్యాయం"— చాలామంది ఒక్కపెట్టున అరిచారు.

అప్పుడు అంతసేపు నిశ్శబ్దంగావున్న పట్వారి లేచాడు.

"ముసలోడ్ని ఏం జంపుతరులేం(డి—ఆ చచ్చిపోయిన పిల్లగాండ్ల తల్లిదం(డులకు ఏదన్న నష్టపరిహారం యిప్పించుం(డి" అన్నాడు.

"పట్వారిగారు చెప్పింది బాగానేవుంది. అనవసరంగా (ప్రాణాలు తియ్యటం మీద మాకూ్కడా నమ్మకం లేదు. నష్టపరిహారం ఎంత చెల్లిస్తే న్యాయంగా వుంటుందో మీరే చెప్పండి" అన్నాడు సురేందర్.

"లక్షకు తగ్గకూడదు" అరిచాడొక యువకుడు.

"కాదు-రెండు లక్షలు" అన్నారు మరొకరు.

ఆ అరుపులన్నీ సద్దుమణిగాక పట్వారీ కేసి చూసి-

"పట్వారిగారూ, యీరారెడ్డి ఆస్తి పాస్తులేమిటో, అతడెంత ఇవ్వగలడో మీకే బాగా తెలుసు. మీరే చెప్పండి" అన్నాడు సురేందర్.

సర్పంచ్, పటేల్, పట్వారి, మరో యిద్దరు పంచాయితిబోర్డు మెంబర్లు ఓ రెండు నిముషాలసేపు గుసగుసలాడారు. చివరకు పట్వారి అన్నాడు-

"లక్షరూపాయలంటే ఆయన మాత్రం ఎక్కణ్ణుంచి తెస్తడు లేం(డి- ఓ నలభై వేలు ఇప్పించుం(డి"

"అన్యాయం-అన్యాయం"—మళ్ళీ అరుపులు.

"పట్వారిది యీరారెడ్డి పక్షమే, అందుకే అంత తక్కువ చెప్పిండు" అన్నాడు సుధాకర్.

"(గ్రామ పెద్దలంతా కలిసి మా పేదవాళ్ళ పొట్టగొడ్తున్నరు" అన్నాడో హరిజన యువకుడు.

సభలో ఇలా చాలాసేపు వాదోపవాదాలు జరిగాయి.

"అందరూ కాస్సేపు నిశ్శబ్దంగా వుండండి. మేం వెంటనే వెళ్ళిపోవాలి. మాకెక్కువ టైమ్ లేదు. అందరి అభి(ప్రాయాలు విన్నాక మేమొక నిర్ణయానికొచ్చాం. ఆ చనిపోయిన కుటుంబాలవాళ్ళకు యీరారెడ్డి యాభై వేలు నష్టపరిహారంగా యివ్వటం న్యాయమని నేను భావిస్తున్నాను. మీరేమంటారు" అన్నాడు సురేందర్.

"యాభై వేలివ్వటం న్యాయమే. అలాగే నిర్ణయించండి" అందరూ ఏక కంఠంతో అరిచారు.

"పట్వారిగారు వెంటనే ఈరారెడ్డికి. సమ్మయ్య. యాదయ్యల తల్లిదండ్రులకు ఇలాంటి ఒప్పందం ఒకటి కుదిరినట్టుగా, ఈరారెడ్డి 50 వేలు ఇవ్వటానికి ఒప్పుకొన్నట్టుగా ఓ పత్రాన్ని రాసి అతని సంతకం తీసుకోండి" అన్నాడు సురేందర్.

వెంటనే అక్కడికి కాగితాలు తెప్పించి పట్వారి ఓ అగ్రిమెంట్ పత్రాన్ని రాశాడు.

దానిమీద సంతకం పెట్టమని ఆ కాగితాన్ని యీరయ్య దగ్గరకు తెచ్చారు.

"నన్నూ, నా భూమిని. నా ఆస్తిని అమ్మినా యాభై వేలు రావు. నన్ను చంపి నా శవంతో సంతకం పెట్టించుకోండ్రి" అన్నాడు యీరయ్య.

"అధిక ప్రసంగం అనవసరం. నిన్ను ప్రాణాల్తో విడిచిపెడ్తున్నందుకు సంతోషించు. త్వరగా సంతకంపెట్టు" అరిచాడు సురేందర్. యీరయ్య కొడుకులిద్దరూ బలవంతంగా యీరయ్యచేత ఆ పత్రంమీద వేలిముద్ర వేయించారు. పట్వారి యీరయ్య కొడుకులిద్దర్నీ కూడా ఆ పత్రం మీద సంతకం చెయ్యమన్నాడు. వాళ్ళిద్దరూ మారు మాట్లాడకుండా సంతకాలు పెట్టేశారు.

"పట్వారిగారు: మీరు, సర్పంచ్. పటేల్ సాక్షులుగా ఆ పత్రం మీద సంతకాలు చెయ్యండి" అన్నాడు సురేందర్.

"మేమెందుకండి" అన్నాడు పటేల్.

"ఎక్కువ మాట్లాడకుండా చేసెయ్యండి" అన్నాడు సురేందర్.

వాళ్ళు ముగ్గురు సంతకాలు చేస్తుండగా సురేందర్ అన్నాడు.

"వారం రోజుల్లోగా యీరారెడ్డి ఈ డబ్బును ఈ ఊరి మా కార్యకర్త సుధాకర్‌కు అందజెయ్యాలి, సుధాకర్ ఆ డబ్బును యాదయ్య, సమ్మయ్యల తల్లిదండ్రులకు చెరి 25 వేలు పంచుతాడు. యీరారెడ్డి ఈ ఒప్పందాన్ని అమలు పరచడంలో యేమైనా పిచ్చిపిచ్చి వేషాలు వేశాడో...."

సురేందర్ అలా మాట్లాడుతుండగానే కొంచెం దూరంలో యేదో జీపువస్తున్న చప్పుడైంది— మరుక్షణంలో సురేందర్ తన అనుచరులతో

పరుగెత్తసాగాడు-జనంలోంచి ఎవరో "పోలీసులొస్తున్నారు-పారిపొండి" అని అరిచారు. జనమంతా చెల్లాచెదురై పోయి ఎటు వీలైతే అటు పిచ్చిగా పరుగెత్తసాగారు. "ధాం! ధాం!" అంటూ నాటుబాంబులు పేలాయి. పోలీసుల విజిళ్ళు వినిపించాయి. పారిపోతున్న వాళ్ళల్లో కొందర్ని పోలీసులు పట్టుకున్నారు. సురేందర్, సుధాకర్లు దొరక లేదు. యీరయ్య కూడా పారిపోయాడు. అంతా కళ్ళుమూసి తెరిచేలోగా జరిగిపోయింది.

తెల్లవారేవరకు ఆ ఊరంతా పోలీసుల్తో నిండిపోయింది. యీరయ్య దగ్గరకొచ్చి ఏం జరిగిందో చెప్పమని అడిగారు, నిర్భయంగా జరిగిందేమిటో చెప్పాడు యీరయ్య.

ప్రభుత్వంవారు వెంటనే ఆ ఊరి పటేల్, పట్వారీలను ఆ రాత్రి ప్రజాకోర్టులో పాల్గొన్నందుకు ఉద్యోగాల్లోంచి సస్పెండ్ చేశారు. ఆ ఊళ్లో పోలీసు క్యాంపొకటి ఏర్పాటుచేసి యీరయ్యతో నిర్భయంగా ఉండండని చెప్పి పోలీసులు వెళ్ళిపోయారు.

'ప్రజాకోర్టు జరుగుతున్నప్పుడు యీరయ్యే ఎవరిద్వారానో రహస్యంగా పోలీసులకు ఫోన్ చేయించా'డని చెప్పుకోవటం మొదలెట్టారు.

ఈరయ్యకు జనం ఇలాఅనుకుంటున్నారని తెలిసినప్పుడు "పోలీసు లెట్లొచ్చింఁడ్రో ఆ భగవంతునికే ఎరుక" అన్నాడు.

ఈరయ్యను ఆ ఊరి పెద్దలు కొందరు "వెంటనే వూరు విడిచి ఎక్కడికైనా పారిపోతే బతికిపొతావని, లేకపోతే నీ ప్రాణం పోవటం ఖాయమని" హెచ్చరించారు. ఈరయ్య భార్య, కొడుకులు, కోడళ్లు కూడా ఈరయ్యను కొంతకాలం ఎక్కడికైనా వెళ్ళటానికి వప్పించ టానికి శతవిధాలా ప్రయత్నించారు. కాని ఈరయ్య ఏమాత్రం కూడా చలించలేదు.

"నాకు చస్తనని భయంలేదు. ఇయ్యాలోన్న రేపో అందరం చచ్చేటోల్లమే. ఆ చచ్చేదేదో నేను నమ్ముకున్న ఈ మట్టిలోన్నే చస్త. యేమీ లేనోడిగ పుట్టిన. మట్టిని నమ్ముకొని బతికిన ఇంతభూమి సంపాదించిన. నా భూమిని చూసుకోంది నేను బతికినా చచ్చినోడితోనే సమానం. నా

భూమికి నాకు వేరు బంధం చేయకుండ్రి. నన్ను వాళ్లొచ్చి చంపితే నన్ను నా భూమిలేన్నె దానం చెయ్యండ్రి. నాకు నాభూమిలేన్నె సమాధి కట్టుండ్రి" అన్నాడు యీరయ్య,

రెండు నెలలు గడిచాయి

ఆరెండు నెలలూ ఆవూళ్లో చాలామంది ఇవ్వాళ్లో రేపో ఈరయ్యను చంపేశారన్న వార్తను వింటామని ఎంతో ఆసక్తిగా ఎదురు చూశారు అలాంటిదేమీ జరక్కపోవటంతో అందరూ ఆ విషయం మరచిపోసాగారు.

పరిస్థితులు చక్కబడ్డాయని ఆ వూరిలోంచి కూడా పోలీసు క్యాంపు ఎత్తేశారు.

ఆ తర్వాత ఒరోజు—అర్థరాత్రి—ఈరయ్య యింటి తలుపులు భళ్ళున తెరుచుకున్నాయి.కత్తులతో. గొడ్డళ్ళతో, నాటు తుపాకులతో ఓ నలుగురు వ్యక్తులు ఈరయ్యయింట్లో ప్రవేశించారు. యీరయ్యను పట్టుకొని ఇంట్లో ఓ స్తంభానికి కట్టేశారు. వీరయ్య కొడుకులు, భార్య, కోడళ్లు,-అంతా గొళ్లుమంటుండగా యీరయ్యను కత్తులతో పొడిచేసి వాళ్లు చీకట్లో కలిసిపోయారు.

ఆ రోజు జరిగిన ప్రజాకోర్టును గూర్చి ఆ వూళ్ళో అంతకు ముందే కొన్ని రోజులుగా మామూలు దుస్తుల్లో తిరుగుతున్న ఓపోలీసు సి.ఐ.డి. వర్తమానం పంపించి పోలీసుల్ని, రప్పించాడని ఈరయ్య చనిపోయిన కొద్దిరోజులకు ఆ వూరి ప్రజలకు తెలిసినప్పుడు "పాపం! ఈరయ్య!" అంటూ బోల్డు సానుభూతిని ప్రదర్శించారు.